క్లుప్తంగా

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం : సంక్రాంతి పండగ సందర్భంగా 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చిరిపల్లి రాము పేదలకు బియ్యం పంపిణీ చేపట్టారు. వార్డులో ఎల్లమ్మ తల్లి పుట్టవద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు ఎం.రమేష్, పీవీఎన్ రెడ్డి, నానాజీ, అనురాధ, హరి, బి.గోపి, శివకుమార్ తదితరుల ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ప్రతి ఏడాది పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

చిన్నారులకు బహుమతుల అందజేత



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న తోట పద్మావతి, చంద్రరావు

అల్లిపురం : సంక్రాంతి సందర్భంగా నీలమాంబ అమ్మవారి ఆలయ అధ్యక్షుడు రీసు చంద్రరావు ఆధ్వర్యంలో చిన్నారులకు బహుమతులు పంపిణీ చేశారు. 34వ వార్డు యాతపేటలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు గురునాథ్, నూకరత్నం, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.



బల్లిగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ శ్రీవారి పాదాల వద్ద కీర్తనలు పాడుతున్న భజన బృందం సభ్యులు



భోగి మంటలు వేస్తున్న దిబ్బలపాలెం యువత

ఊరంతా సంక్రాంతి

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పల్లెలు భోగి వెలుగుల్లో మిరుమిట్లు గొలుపుతున్నాయి. ప్రతి ఇంట రంగవల్లుల వర్ణాలు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నల పల్లెపదాలు, హరిదాసుల కీర్తనలు, ఢమరుక నాదాలు, జంగమదేవరల జేగంటలు, పిట్టలదొరల బడాయి కబుర్లతో పట్నాలు కూడా పల్లెల్ని తలపిస్తూ.. సాంప్రదాయ కాంతులను విరజిమ్ముతున్నాయి.

- భోగి మంటల వెలుగులు
- ముంగిళ్లన్నీ రంగువల్లుల వర్ణాలు
- వెల్లివిరుస్తున్న ఆనందోత్సవాలు



చలిమంట వద్ద గంగిరెద్దుతో యువత



గాలిపటాలతో అలంకరించిన నరహరిదొడ్డి

డాబాగార్డెన్స్ : సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. డూడూ బసవన్నలు.. గంగిరెద్దుల కోలాహలంతో భోగిమంటల వెలుగుల్లో పండగ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ పరిధి పూర్ణామార్కెట్ నుంచి టౌన్‌కొత్తరోడ్డు వరకు ఉన్న 33 దుకాణాల ముందు ఆయా దుకాణాల యజమానులు భోగి మంటలు వేశారు. వీధులు, గల్లీల్లో భోగి మంటల సందడి కనిపించింది. జీవీఎంసీ 29వ వార్డు పరిధి దిబ్బలపాలెంలో వరుసగా నాలుగైదు వీధుల్లో పెద్ద ఎత్తున మంటలు వేశారు. ప్రేమసమాజంలో అనాథ పిల్లలు సంక్రాంతి సందడిని పురస్కరించుకుని భోగి మంటలు వేసి ఎంజాయ్ చేశారు.

జిలుగు వెలుగుల భోగి..

అల్లిపురం : నియోజకవర్గ ప్రజలు భోగి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మేలుకొలుపుల బృందం హరినామ స్మరణతో అల్లిపురంలో తిరువీధి నిర్వహించారు. భోగి మంట వద్ద హరినామ సంకీర్తనలు పాడి అందరినీ ఉత్సాహపరిచారు. హరిదాసుల సందడితో తెల్లవారింది.



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం

మహిళలు ఆయన అక్షయ పాత్రలో భిక్ష వేసి నమస్కరించుకున్నారు. యువత గాలిపటాలతో వీధులన్నింటినీ అలంకరించటంతో వీధులు రంగు రంగుల పతంగులతో సుందరంగా కనిపిస్తున్నాయి. చిన్నారులకు పెద్దవారు భోగిపండ్లు పోసి పాటలు పాడి ఉత్సాహపరిచారు.

ఎర్నిమాంబ ఆలయంలో..

కంచరపాలెం : కాన్వెంటు కూడలి జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో భోగి-సంక్రాంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ అవరణలో వేసిన భోగి మంటల్లో వినాయకుని ఆకారం కనిపించడంతో భక్తులు చూసి తరించారు. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.



పొంగలి కుండలు, చెరుకులు, గడ్డితో ఆకట్టుకుంటున్న అలంకరణ



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

ఇల వైకుంఠం బల్లిగిరి

కమనీయంగా గోదారంగనాథుల కల్యాణం



విశేష అలంరణలో గోదా రంగనాథులు



స్వామి, అమ్మవార్లకు దేవదాయ శాఖ తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఈవో జీవీ రమాబాయి



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం అల వైకుంఠాన్ని తలపించింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా దేవస్థానం కల్యాణ మండపంలో కమనీయంగా గోదారంగనాథుల కల్యాణం నిర్వహించా రు. గోదాదేవి, రంగనాథులు భక్తులకు కల్యాణ మూర్తులుగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘునాథాచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. గోదాదేవి రంగనాథుని కల్యాణం చేసుకునేందుకు నెల రోజుల పాటు ధనుర్మాసంలో ఆయనను స్తుతిస్తూ రచించిన తిరుప్పావై పాశురములు, వాటి విశిష్టతను భక్తులకు వివరించారు. నెలరోజుల పాటు ఆమె చేసిన పూజల ఫలితంగా సాక్షాత్తు రంగనాథుడు గోదాదేవిని కల్యాణం చేసుకున్నారని వివరించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి దేవదాయ శాఖ తరఫున గోదారంగనాథులకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు దేవస్థానంలో కల్యాణ విందు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అలమేలు మంగ దేవాలయంలో..

స్థానిక అలమేలు మంగ దేవాలయంలో ఆదివారం సాయంత్రం గోదారంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయ అర్చకులు పి.కేశవాచార్యులు కల్యాణమూర్తులను విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో అలమేలు మంగమ్మకు, పద్మావతి అమ్మవారికి, గోదాదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

పట్నం.. పల్లెబాట

- ఖాళీగా కూడళ్లు
- నిర్మానుష్యంగా కాలనీలు



నిర్మానుష్యంగా కాన్వెంట్ జంక్షన్



నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణా జంక్షన్ ఇలా..

డాబాగార్డెన్స్ : పట్టణం గ్రామం వెళ్లింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ అయింది. నగర రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి పండగ సందర్భంగా విశాఖ మహానగరంలో నివాసముంటున్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు విశాఖ నుంచి వారి వారి ప్రాంతాలకు తరలి వెళ్లడంతో నగరం నిర్మానుష్యంగా మారింది. నియోజకవర్గంలో అధిక ప్రాంతాల్లో వలస వచ్చిన వారు ఉండడం .. వారంతా సంక్రాంతి పండగకు వారి సొంతూళ్లకు తరలి వెళ్లడంతో చిలకపేట, అల్లిపురం, భూపేష్‌నగర్, కల్లుపాకలు, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలు వెలవెలబోయాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఒకరు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ కె. శ్రీలక్ష్మి తెలిపారు. ఈ నెల 2వ తేదీన రైల్వే స్టేషన్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాగిరెడ్డి మోషేష్ జీవన్ కుమార్ (50) తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు తన పేరు మాత్రమే తెలిపాడని, అతని ఊరు తెలియజేయలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఈస్ట్ ట్రాఫిక్ సీఐ 9440796016, టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ 9440796041 నంబర్లకు తెలియజేయాలన్నారు.

మద్యం మత్తులో న్యాయవాది..

అల్లిపురం : విపరీతంగా మద్యం తాగటంతో న్యాయవాది మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం రొంకాన శ్రీకాంత్ (41) న్యాయవాద వృత్తి చేస్తున్నారు. ఇతను నాలుగు రోజులుగా ఇంటికి వెళ్లకుండా తన కార్యాలయంలోనే మద్యం తాగుతూ ఉండిపోయారు. ఈ నెల 12వ తేదీన ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా లలితాకాలనీలో గల ఆఫీసులో ఉన్నానని సమాధానం చెప్పారు. అతని మామయ్య 13వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అతని కార్యాలయానికి వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. సందులో నుంచి చూడగా కింద పడిపోయి వున్నారు. ఫోన్ చేయగా రింగ్ అవుతున్నా ఫోన్ తీయకపోవటంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూశారు. అతను ఎంతకీ లేవకపోవటంతో 108కి ఫోన్ చేశారు. వారు చూసి చనిపోయినట్లు తెలిపారు. మృతుని మామ గుండ్ల గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందామని.. మోదీని గద్దె దింపితేనే దేశానికి భవిష్యత్తు అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద తలపెట్టిన దీక్షా శిబిరం 1018వ రోజుకు చేరుకుంది. దీక్షకు సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఆధునిక దేవాలయాల్లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా మోదీ తన అనుయాయులకు కట్టబెట్టాలని చూస్తే కార్మికవర్గం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎం. శ్రీనివాస్, ఆదిశేషమ్మ, సామ్రాజ్యం, ఓవీ రావు, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు



పీజే గణేష్‌కుమార్

మహారాణిపేట : గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.జె. గణేష్‌కుమార్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలుగింట సంప్రదాయాలకు సంక్రాంతి పండగ అద్దం పడుతుందన్నారు. అంతా సంతోషంగా పండగ జరుపుకోవాలని కోరారు.

పండగ వేళ రైతు బజార్లు కిటకిట



రద్దీగా ఉన్న సీతమ్మధార రైతుబజారు

కంచరపాలెం/సీతమ్మధార : కంచరపాలెం, సీతమ్మధార రైతు బజార్లు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. దేవ గుమ్మడి, చెరకు గడలు, కూర పెండలం, చిలగడ దుంపలతో పాటు ఇతర కూరగాయలు, ఆకుకూరలు, పూజ సామగ్రి, పండ్లు, పువ్వులు, పసుపుకుంకుం, ఆకులు, వక్కలు, కొబ్బరి కాయల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. కొనుగోలు దారులతో రైతు బజార్లు సందడిగా మారాయి. అల్లూరి,అనకాపల్లి జిల్లాల్లోని అరకు, కృష్ణదేవిపేట, నర్సీపట్నం, దేవరాపల్లి సబ్బవరం, కొత్తవలసతో పాటు రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి దుంపలు, చెరకు గడలను విక్రయానికి భారీగా తీసుకువచ్చారు. రైతులు ఎక్కువ ధరలకు అమ్మకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మధురవాడ: సంక్రాంతి సంబరాలు శిల్పారామం జాతరలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను కట్టి పడేశాయి. విశాఖపట్నం శ్రీ శివసాయి భరతనాట్య కళా బృందం వారిచే నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. శిల్పారామం అధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

జోరుగా గాలిపటాల విక్రయాలు

సీతంపేట: సంక్రాంతి పండగ అంటే పిల్లలకు గుర్తొచ్చేది గాలిపటాలు. పండగ సెలవుల్లో గాలిపటాలు ఎగురవేయడానికి పిల్లలు ఉత్సాహం చూపిస్తుంటారు. పిల్లలను ఆకర్షించేలా వివిధ రంగులు, డిజైన్లలో పతంగులను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. శంకరమఠం రోడ్డు, అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లో రోడ్డు పక్కన ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి వీటిని విక్రయిస్తున్నారు. పేపర్, పాలథిన్, క్లాత్‌తో తయారు చేసిన మూడు రకాల గాలిపటాలు అమ్ముతున్నారు. గబ్బిలం, గద్ద , బటర్‌ఫ్లై, ఏంజిల్, గుడ్లగూబ, రామచిలుక ఆకారాలలో క్లాత్‌తో తయారు చేసిన గాలి పటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఆకట్టుకున్న నృత్య నీరాజనం



ప్రత్యేక పూజలు అందుకున్న సీతారాములు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: బాల సరస్వతి నృత్య నికేతన్ వారు నిర్వహించిన భరతనాట్య నృత్య నీరాజనం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్యలో రామ మందిర ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్, విశాఖ ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రామ భక్తులు పాల్గొన్నారు. చిన్నారులు చేసిన నృత్యాలను, భరతనాట్య నృత్య నీరాజనాన్ని వీక్షించారు. కుమారి శృతి రాజ్ కూచిపూడి నృత్య నీరాజనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేద పండితులు శ్రీ సీతారామలక్ష్మణ అంజనేయ స్వామి వారికి ప్రత్యేక హారతి కార్యక్రమాన్ని కనువిందుగా నిర్వహించారు.